నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | అక్టోబర్ 17, 2023 | www.navatelangana.com

రూ.2 లక్షల నగదు పట్టివేత



వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో స్వామి అనే వ్యక్తి నుంచి రెండు లక్షల రూపాయల నగదు ను సోమవారం పట్టుకున్నట్లు ఏసై మురళి తెలిపారు. బీబీపేట మండలం లోని మల్కాపూర్ గ్రామానికి చెందిన స్వామి తన కారులో దోమకొండ మండల కేంద్రం మీదుగా వెళుతున్న క్రమంలో నగదు ను పట్టుకొని విచారణ చేయగా 2 లక్షల నగదు కు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని స్వాదినం చేసుకొని ప్లాయింగ్ స్వాడ్ బృందనికి అప్పగించినట్లు తెలిపారు.

కామారెడ్డి నుంచే షబ్బీర్ పోటీ

- దుష్ప్రచారాలు నమ్మొద్దు : కాంగ్రెస్

నవతెలంగాణ-లింగంపేట్

షబ్బీర్ అలీ కామారెడ్డి నుండి పోటీ చేస్తారని సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాలు నమ్మవద్దని టిపిసిసి మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీ యొదిన్ అన్నారు. సోమవారం లింగంపేట్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి షబ్బీర్‌అలీ పోటీచేయనున్నారని, ఆయన ఎల్లారెడ్డికి రానున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జొన్నల రాజు మండల ఉప అధ్యక్షులు శివాయ మండల యోత్ అధ్యక్షులు గోవింద్ టౌన్ యోత్ అధ్యక్షుడు ఇర్ఫాన్ దశరథ్ సూపల్ల రాజు నగేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్

అభివృద్ధితో పాటు సంక్షేమమూ ముఖ్యం

- బీఆర్ఎస్‌తోనే ఆ రెండు సాధ్యం
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయండం లేదు : స్పీకర్ పోచారం

నవతెలంగాణ-బాన్సువాడ

'పజలకు కనీస అవసరాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం ముఖ్యం. తెలంగాణ రాష్ట్రం వచ్చాక దుర్భిక్షం పోయి సుభిక్షం అయింది. సంక్షోభం పోయి సంక్షేమం అయింది. తెలంగాణ రాకముందు టీడీపీ, కాంగ్రెస్ పార్టీల ప్రభుత్వాల హయాంలో సంక్షేమ రంగానికి చాలీచాలని నిధులు ఇచ్చేవారు. కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ రాష్ట్ర సంపదను పెంచి ఆ సంపదను ప్రజలకు పంచుతున్నాం. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమ రంగంలో దేశంలో నెంబర్ వన్'గా నిలిచిందని బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

బాన్సువాడలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 'చెప్పిందే చేసుడు కేసీఆర్ కు అలవాటు. 2018 మేనిఫెస్టోలో చెప్పిన అంశాలను వంద శాతం అమలు చేశారు. పేదల బాగు కోసం కేసీఆర్ గారి గుండెలలో నుండి వచ్చిన పథకాలు ఇవి.

'కాంగ్రెస్ జాతీయ పార్టీనా లేక ప్రాంతీయ పార్టీనా. మీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఇలాంటి సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో ప్రకటించక ముందు మీ పాలనలో ఉన్న రాష్ట్రాలలో అమలు చేస్తే ఇక్కడ ప్రజలు నమ్ముతారు. మీరు అధికారంలోకి రావడం కలనే' అని అన్నారు.

చెప్పిన పనులను కేసీఆర్ మాత్రమే చేయగలరని, ప్రజలు కేసీఆర్‌ను మాత్రమే నమ్ముతారని, ఇప్పుడు బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను నూటికి నూరు శాతం అమలు చేస్తారని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందని కాంగ్రెస్, బిజెపి లకు మెజారిటీ స్థానాలలో అభ్యర్థులు లేరు.. డిపాజిట్లు రావని అన్నారు. బి-ఫారం ఇచ్చి, ఎన్నికల ఖర్చు కోసం పార్టీ తరుపున రూ.40 లక్షలను చెక్కు రూపంలో ఇచ్చిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మీడియా సమావేశంలో పాల్గొన్న రైతుబంధు జిల్లా అధ్యక్షుడు డి. అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్, పీఏసీఎస్ చైర్మన్ ఎర్వల కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు గోపాల్ రెడ్డి, గురు వినయ్, విఠల్ రెడ్డి, జిన్నా రఘు, నరసింహా చారి తదితరులు.

ఆహారం కోసం వలస వచ్చిన బాతులు

నవతెలంగాణ-రెంజల్



రెంజల్ మండలంలో వరి కోతలు ప్రారంభం కావడంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి బాతుల యజమానులు వాటి ఆహారం కోసం వలస వస్తున్నారు. వరి కోతలు పూర్తి అయిన తర్వాత పంట పొలాలలో కిందపడ్డ ధాన్యం గింజలను బాతులు ఆహారంగా తీసుకుంటున్నాయి. దగ్గరలో ఉన్న నీటి గుంటల వద్ద దప్పిక తీర్చుకొని తిరిగి పంటలు పూర్తయిన పొలాలలోని గింజలను వాటి ఆహారాన్ని తీర్చుకుంటున్నాయి. వందల సంఖ్యలో బాతులు వస్తుండడంతో వారు పంట పొలాలలోనే గుడారాలను వేసుకొని వాటి రక్షణ కోసం జాలీలలో ఉంచుతున్నారు. రెండు మూడు రోజులకు మారు బాతుల గుడ్లను జమ చేసి తిరిగి వాటిని ట్రైన్లో నెల్లూరుకు పంపుతామని వారు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలతో పాటు, బోధన్, ఎడపల్లి, నవీపేట్ మండలాలలో సైతం వారు వలస వచ్చి బాతుల ఆహారాన్ని అందించనున్నట్లు తెలిపారు.

అసంతృప్తులే.. ఆప్తులు

బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నజర్

- ఆ పార్టీ అసంతృప్తులను చేర్చుకునేందుకు కాంగ్రెస్ స్కెచ్
- తాజాగా కాంగ్రెస్‌లోకి బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్..
- తూము పద్మవతి శరత్‌రెడ్డి వెంట పలువురు కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు
- బోధన్‌లో రోజురోజుకూ మారుతున్న సమీకరణలు





నవతెలంగాణ-బోధన్

ఎన్నికల వేళ దగ్గరపడుతున్నా కొద్దీ రాజకీయం వేడుక్కుతోంది. అయితే బీఆర్ఎస్ పార్టీలోని అసంతృప్తులను కాంగ్రెస్ వల వేసి తమ వైపు తిప్పుకుంటుంది. దీంతో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. జిల్లాలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి శరత్‌రెడ్డి కొద్ది రోజులుగా ఎమ్మెల్యే షకీల్ తీరుపై ఆగ్రహంగా ఉండగా.. ఆయనను కాంగ్రెస్ తన వైపు తిప్పుకుంది. అదే విధంగా ఆకుల లలితను సైతం కాంగ్రెస్‌లో చేర్చుకోనున్నట్టు సమాచారం.

బోధన్ పట్టణంలో రాజకీయం వేడెక్కింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో పార్టీలలో చేరికలు కొనసాగుతున్నాయి. బోధన్ మున్సిపల్ చైర్మన్ అధికార పార్టీ నాయకురాలు అయిన తూము పద్మావతి, ఆమె భర్త కౌన్సిలర్ శరత్ రెడ్డి తమ అనుచరులతో సోమవారం వాహనాలలో హైదరాబాద్ వెళ్లి పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత కొంతకాలంగా ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ తో నెలకొన్న విభేదాల కారణంగా మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, ఆమె భర్త కౌన్సిలర్ శరత్ రెడ్డి పలు కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వ సమావేశమైన పార్టీ కార్యక్రమాలైన వారు హాజరు కాకుండా దూరంగా ఉంటున్నారు. బోధన్ పట్టణంలో గత నెల రోజుల క్రితం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరైన అట్టి సభకు సైతం వారు దూరంగా ఉన్నారు. అలాగే పలు కారణాలతో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఎంఐఎం కౌన్సిలర్లతో పాటు తూము శరత్ రెడ్డి పై కేసులు నమోదు చేయడంతో అప్పటినుండి వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఏర్పడ్డాయి. వారి మధ్య సయోధ్య కుదర్చడానికి పార్టీ పెద్దలు ప్రయత్నించినా వివాదం సద్దుమణగలేదు. ఎమ్మెల్యే షకీల్ ఆమెర్‌కు బోధన్ అభ్యర్థిగా ప్రకటించకుండా మార్చాలని తూము శరత్ రెడ్డి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోకపోవడంతో పార్టీని విడాలని నిర్ణయానికి వచ్చినట్లు గత కొన్ని రోజులుగా చర్చ కొనసాగింది. దాంతో ఎట్టకేలకు తన అనుచరులతో పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లతో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి వారితో తాను చేపట్టే భవిష్యత్ కార్యక్రమం గురించి చర్చించారు.

అందరి సూచనలు సలహాలతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడానికి నిశ్చయించుకున్నారు. గతంలో బిజెపి పార్టీలో, ఎంఐఎం పార్టీలో చేరతారని జోరుగా ఊహగానాలు కొనసాగాయి. అయినా మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి చొరవతో తూము శరత్ రెడ్డికి రాష్ట్ర స్థాయిలో ఉన్న పరిచయాలతో జరిపిన చర్చలు సఫలమై సోమవారం తన అనుచరులతో వాహనాలలో హైదరాబాద్ వెళ్లి పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి తూము దంపతులకు పార్టీ కండువా వేసి పార్టీలో ఆహ్వానించారు.

గత వారం క్రితం సాలంపాడ్ క్యాంప్ గ్రామంలో సర్పంచ్ అంజమ్మ నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంబించడంతో ఏవో కారణంతో ఆమెకు అధికారులు నోటీసు జారీ చేశారు. దాంతో ఆమె కుమారుడు శరత్ రెడ్డితో పాటు కాంగ్రెస్‌లో చేరారు. 1వ వార్డు కౌన్సిలర్ తాళ్ల లత, 23 వ వార్డు కౌన్సిలర్ మీర్ నజీర్ ఆలీ, 29వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్, మున్సిపల్ కాంట్రాక్టర్ల యూనియన్ అధ్యక్షులు వల్లూరి చందుతో పాటు మరికొంత మంది ప్రజా ప్రతినిధులు వారితో కాంగ్రెస్ లో చేరారు. అలాగే ఈ నెల 20 న బోధన్ లో రాహుల్ గాంధీ పర్యటన సంధర్బంగ మరికొంత మంది కాంగ్రెస్ లో చేరనున్నట్లు శరత్ రెడ్డి ప్రకటించారు.

బోధన్‌లో రసవత్తరంగా మారనున్న రాజకీయం..

ప్రస్తుతం జరిగే శాసనసభ ఎన్నికల్లో బోధన్ పట్టణంలో రాజకీయం రసవత్తరంగా మారనుంది. కాంగ్రెస్ పార్టీలో చేరిన తూము శరత్ రెడ్డి దంపతులు ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ కు ఓడించాలనే లక్ష్యంతోనే పావులు కదుపుతున్నారు. దాంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజక వర్గంలో పర్యటించి ప్రచారం చేయను న్నారని సమా చారం. తన అనుచరులను తనతో ఉన్న సర్పంచులు, ఎంపిటిసిలతో కలిసి అధికార బీఆర్ఎస్ పార్టీకి ఓడించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే అధికార బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అయిన దళిత బంధు, బీసీ బందు, మైనారిటీ బందు, డబుల్ బెడ్ రూం లాంటి సంక్షేమ పథకాలు ఎక్కువ మందికి అందకపోవడంతో చాలా మంది నిరాశకులోనై నాయకుల తీరుపై అసహనంతో ఉన్నారు. ఈ పథకాలు తమకు వచ్చే అవకాశం లేదని నిరాశ చెందుతూ బీఆర్ఎస్ పార్టీకి అంటీ ముట్టనట్లు కొనసాగుతున్న వారిని చేరదీసే ప్రయత్నాలు చేపడుతున్నట్లు సమాచారం.

ద్వితీయ శ్రేణి నాయకులు వారికి నచ్చచెపుతున్న ఈసారి వారు వినే పరిస్థితులో లేరని తెలుస్తోంది . ప్రభుత్వంపై వ్యతిరేకతను అవకాశంగా తీసుకుంటున్న బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను తమ వైపుకు మరల్చుకునే విధంగా ప్రయత్నిస్తున్నారు. దాంతో బోధన్ లో నువ్వా నేనా అన్న విధంగా రాజకీయం రసవత్తరంగా మారనుంది. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఎన్నికలలో ఎలాగైనా విజయం సాధించడమే లక్ష్యంతో నాయకులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ మండలాలో పర్యటిస్తున్నారు. ప్రతిపక్షాలకు ధీటుగా ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ప్రతి మండలం నుంచి ప్రధాన నాయకులతో, ముఖ్య కార్యకర్తలతో అంతరంగిక సమావేశం ఏర్పాటు చేస్తూ తన విజయం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తనకు విజయం చేకూరుస్తుందని ఎమ్మెల్యే ధీమాగా ఉన్నారు. ఏదేమైనా ఈ ఎన్నికలు ఆయా పార్టీలకు కత్తి మీద సాముల మారనున్నాయి.

బీఆర్ఎస్‌కు ఆకుల లలిత రాజీనామా

- త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు సమాచారం..?



నవతెలంగాణ-కంఠేశ్వర్

సీడబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత బీఆర్ఎస్ పార్టీకి సోమవారం రాజీనామా చేశారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని, కేవలం ఎమ్మెల్యేల ప్రభుత్వం నడుస్తోందని సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. తన 23 సంవత్సరాల ప్రజా జీవితంలో, ఎంపీటీసీగా, జడ్పీటీసీగా, ఎంపీపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, కార్పొరేషన్ చైర్మన్ ఎన్నో పదవులు నిర్వర్తించానని, కానీ స్థానిక సంస్థల పట్ల ఇంతటి నిర్లక్ష్యం, అవమానం గతంలో ఎప్పుడూ లేదని లేఖలో పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నుంచి నిజామాబాద్ అర్బన్ స్థానం ఆశించినా దక్కకపోవడంతో రాజీనామా చేసినట్టు సమాచారం. బిగాలను అభ్యర్థిగా ప్రకటించినా.. చివరి నిమిషంలో బీ ఫామ్ ఇవ్వకుండా తనకు వరిస్తుందేమోనని ఎదురుచూడగా.. ఆదివారం బీ ఫాం సైతం అందజేయడంతో రాజీనామా చేసినట్టు భోగట్ట. అయితే ఆకుల లలిత ఏ పార్టీలో చేరుతున్నారో ఇంకా ప్రకటించకపోయినా కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. టికెట్‌పై చర్చలు నడుస్తున్నట్టు సమాచారం.

తండ్రికొడుకుల దాడిలో వ్యక్తి మృతి

- మద్యం ఇవ్వనందుకు ఘాతుకం



నవతెలంగాణ-నవీపేట్

మద్యం ఇవ్వనందుకు ఒకరిపై తండ్రి కొడుకులు దాడి చేయగా బాధితుడు మృతి చెందిన సంఘటన నవీపేట్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. నార్త్ రూరల్ సిఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దర్యాపూరు కాలనీకి చెందిన కొక్కుల సాయిరాం(42) దుబాయ్ నుండి కొన్ని రోజుల క్రితం తిరిగివచ్చాడు. మద్యానికి బానిస కావడంతో స్థానిక చేపల మార్కెట్ షెడ్డులో ఆదివారం మద్యం సేవిస్తుండగా లింగమయ్య గుట్టకు చెందిన ధైరంగుల నాగరాజు మద్యం ఇవ్వాలని కోరగా ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్యన ఘర్షణ జరిగింది. నాగరాజు కడుపు, చాతిపై తీవ్రంగా కొట్టడంతో పాటు అతని కొడుకు గణేష్ సైతం తీవ్రంగా కొట్టాడు. దీంతో బాధితుడి కుమారుడు అతన్ని స్థానిక ఆర్ఎంపి వైద్యుడి వద్ద చికిత్స చేసి ఇంటికి తీసుకెళ్లగా అతను గత రెండు రోజుల నుండి ఆహారం తీసుకోకపోవడం రాత్రి సైతం తినకుండా నిద్రపోవడంతో సోమవారం ఉదయాన్నే మృతి చెందాడు. మృతుడి భార్య కొప్పుల ఇందిరా ఫిర్యాదు మేరకు సీఐ సతీష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం మేరకు నిజామాబాద్ ఏసీబీ కిరణ్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట ఎస్సై యాదగిరి గౌడ్ ఉన్నారు.

ముద్దపప్పు బతుకమ్మ సంబరాలు



బతుకమ్మతో మహిళల సంబురం

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నాగేశ్వర గ్రామంలో ముద్ద పప్పు బతుకమ్మను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆడబిడ్డలంతా ముద్దపప్పు బతుకమ్మను అలంకరించి బతుకమ్మ ఆటపాటలతో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయం ఉట్టిపడేలా ముద్దపప్పు బతుకమ్మ సంబరాన్ని నిర్వహించారు.

ఆర్మీలా.. కలిసికట్టుగా పనిచేయాలి

- కలెక్టర్ జితేశ్ వి పాటిల్
- ఎన్నికల అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికల విధులలో నియమించిన అధికారులందరూ కలిసికట్టుగా ఆర్మీలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ నుండి రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఒలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్‌తో కలిసి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అధికారులందరూ తమకు అప్పగించిన పనులను సమర్థవంతంగా నిర్వహిస్తామనే పూర్తి విశ్వాసంతో పనిచేయాలని హితవు చెప్పారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంచించి వచ్చిన ఫారం-7,8 లను ఈ నెల 19 లోగా క్షేత స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. జిల్లాలో 51 వేల నూతన ఓటరు ఎపిక్ కార్డుల పోస్టల్ శాఖ ద్వారా జరుగుచున్న పంపిణీపై దృష్టిపెట్టాలన్నారు.

నామినేషన్ల ప్రక్రియ ముగిసే నవంబర్ 10 వరకు ఓటరు నమోదు జరుగుతుందని, ఆ పిదప అనుబంధ ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. ఎన్నిక ప్రవర్తనా నియమావళి ఖచ్చితగంగా అమలయ్యేలా చూడాలని, చెక్ పోస్టులపై నిఘా ఉంచి అనుమానస్పదంగా డబ్బు, మద్యం, కానుకలు తదితర రవాణా జరుగుచుంటే ఎవరిని ఉపేక్షించక స్వాధీనం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పోలింగ్‌కు 48 గంటల ముందు ఉల్లంఘనలు ఎక్కువగా జరిగే అవకాశముంటుందని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి రూట్ మ్యాప్ ఆధారంగా అన్ని పోలింగ్ బూతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మౌలిక వసతులున్నాయా తెలుసుకో వాలన్నారు. పోలింగ్ కేంద్రం తప్పని సరిగా గ్రౌండ్ ఫ్లోర్ లో ఉండేలా చూడాలని, లోపలికి ,బయటికి వెళ్లేలా దారులుండాలని, తప్పనిసరిగా వీల్ చైర్ ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఫర్నీచర్, మంచినీరు, టాయిలెట్స్ , లైటింగ్, ర్యాంపు ఉండేలా చూడాలని, పంచాయతీ కార్యదర్శుల సేవలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు ఓటరు అవగాహన నిమిత్తం తప్పని సరిగా 4 రకాల పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. పోలింగ్ శాతం తక్కువగా ఉన్న కేంద్రాలలో దృష్టిపెట్టాలన్నారు. సభలు, సమావేశాలకు సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేయాలని, వాహనాల అనుమతికి జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.

ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారులు మను చౌదరి, ప్రభాకర్, శ్రీనివాస్, జిల్లా పరిషద్ సీఈఓ సాయ గౌడ్,కలెక్టరేట్ ఏ.ఓ. మసూర్ అహ్మద్, ఎలక్షన్ సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్ , తహసీల్దార్లు, ఎంపిడిఓలు, పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ నిఘా

అదనపు కలెక్టర్ మను చౌదరి



నవతెలంగాణ-మద్నూర్

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం జుక్కల్ నియోజకవర్గం ఎన్నికల ఏర్పాట్లను ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి ఐఏఎస్ మద్నూర్ మండల కేంద్రంలో స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, నామినేషన్ ప్రక్రియ, వివిధ ఏర్పాట్లను పరిశీలించి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మద్నూరు మండల కేంద్రంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో స్ట్రాంగ్ రూంల ఏర్పాటుపై గదులను పరిశీలించారు. అదేవిధంగా స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో పకడ్బందీ నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు అంతర్రాష్ట్ర చెక్ పోస్టు, జిల్లాల చెక్ పోస్టులలో నిఘా విభాగంతో పాటు వీడియో రికార్డింగ్, సీ సీ కెమెరాల ద్వారా నిఘా పెట్టినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్ వేసే విధానాన్ని ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చినట్లు తెలియజేశారు. ఎన్ కోర్, సువిధ అనే ఆన్‌లైన్ సైట్ల ద్వారా రాజకీయ పార్టీల ప్రచా రాలు, వివిధ అనుమతుల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ప్రచారానికి సంబంధించి అనుమతులు పొందాలంటే 48 గంటల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, డిప్యూటీ తాసిల్దార్ భరత్, గిర్దవర్ శంకర్, సీనియర్ అసిస్టెంట్ విజయ్, సిబ్బంది ముస్తఫా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బాల్కొండ విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యాంరావు



పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్యాంరావు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది శ్యాంరావు సోమవారం బోధన్ ఐదవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీ నరసయ్య నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య అభినందనలు తెలిపారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



నవతెలంగాణ-విలేకరుల బృందం

రెంజల్ : మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో బతుకమ్మ పండుగ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమైన బతుకమ్మ పండుగను మహిళలు అత్యంత శ్రద్ధతో గ్రామంలోని ఆలయాల ముందు బతుకమ్మ పాటలతో అలరించారు. గ్రామంలోని ప్రతి ఇంటి ఆడపడుచులు వివిధ రకాల పూలను సేకరించి పోటీ పడి బతుకమ్మలను తయారు చేశారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోనున్న అలీసాగర్ లిఫ్ట్ కాలువలో నిమజ్జనం చేశారు. ఆడపడుచులు ఆలయాల వద్దకు వచ్చి బతుకమ్మ పాటలు పాడుతూ పలువురిని ఆకర్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలుమల సునీత నరసయ్య, ఎంపీటీసీ చింతకుంట లక్ష్మి లింగారెడ్డి, ఉపసర్పంచ్ మస్కూరి లక్ష్మి, స్థానిక నాయకులు నరసయ్య, మధు, శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌రావు, లింగాల అబ్బన్న, గ్రామంలోని మహిళలు యువత తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : మహిళలు ఎంతో ఉత్సాహంగా సంస్కృతి సాంప్రదాయాలతో జరుపుకునే బతుకమ్మ పండుగను బోధన్ ఉమ్మడి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తంగేడు, గునుగు, బంతిపూలు పేర్చి బతుకమ్మలు తయారుచేసి ఆటపాటలతో అలరించారు. అనంతరం బతుకమ్మలు తీసుకొని సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ప్రతి గ్రామంలో మహిళలు బతుకమ్మలతో డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. దాంతో గ్రామాలలో మహిళలతో సందడిగా మారింది. ఈ సందర్భంగా బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి, జెడ్పీటిసి లక్ష్మి మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వర్ని(చందూర్) : తెలంగాణ సంప్రదాయమైన బతుకమ్మ పండగను మండల కేంద్రంలో మహిళలు, చిన్నారులు ఆటపాటలతో ఘనంగా జరుపుకొన్నారు.



బోధన్‌లో బతుకమ్మ సంబరాలు



వర్నిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

బెల్టుషాపులపై దాడులు



లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్న ఏఎస్ఐ రాములు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని బేగంపూర్ గ్రామంలో స్థానిక ఏఎస్ఐ రాములు దాడులు నిర్వహించారు. బెల్టుషాపుల్లో 3.9 లీటర్ల బీర్లు, 8.4 లీటర్ల లిక్కర్ స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బెల్ట్‌షాప్‌లపై కఠిన చర్యలు తప్పవని, మద్యం షాపుల నిర్వాహకులకు హెచ్చరికలు జారీచేశారు.

ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మంగ్లారం మహిపాల్



ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికైన మహిపాల్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ధర్మ సమాజ్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నందిపేట్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన మంగ్లారం మహిపాల్ బరిలో నిల్వనున్నారు. ఈ మేరకు సోమవారం ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్ మంగ్లారం మహిపాల్‌ను బాల్కొండ నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించారు. ఈ సందర్భంగా మంగ్లారం మహిపాల్ మాట్లాడుతూ ధర్మ సమాజ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన డాక్టర్ విశారదన్ మహారాజ్ కు ధన్యవాదాలు తెలిపారు. బాల్కొండ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలంతా టార్చ్ లైట్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అభిముఖంగా ధర్మ సమాజ్ పార్టీ పోటీలో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉమేష్(మోర్తాడ్), మహేష్(వేల్పూర్), నాయకులు సతీష్, నిశాంత్, సాయి, క్రాంతి, రంజీత్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాలను నివారించాలి



ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాలను నివారించాలని, అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు నిజామాబాద్ నగరంలోని 5వ డివిజన్, మోపాల్ మండల రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి ఫెన్సింగ్ వేసుకున్నరన్నారు. మోపాల్ మండల రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను భూ కబ్జాదారుల నుండి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ భూముల్లో బోర్గం(పి), మహాలక్ష్మి నగర్, ఆర్య నగర్ వినాయకనగర్, మాధవనగర్, పాంగ్రాల్లో నివసిస్తున్న అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న నగర కార్యదర్శి ఎం.సుధాకర్ డివిజన్ సహాయ కార్యదర్శి సీహెచ్. సాయగౌడ్ నాయకులు డి.గంగమల్లు, గంగారం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



సంఘం సభ్యులను కాంగ్రెస్ పార్టీకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-దోమకొండ

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం మండలంలోని సంగమేశ్వర్ గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ఎల్లప్పుడూ పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికులుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మండల నాయకులు పల్లె రామస్వామి గౌడ్, సంఘం సభ్యులు ఉన్నారు.

ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మబోరు

- మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్

నవతెలంగాణ-గాంధారి/లింగంపేట్

తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో లేరని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో తెలంగాణ ప్రజలు లేరని కాంగ్రెస్ పరిపాలించిన రోజుల్లో కరెంటు కష్టాలు ప్రజలకు తెలుసని అన్నారు. ఎరువుల కోసం, విత్తనాల కోసం తెలంగాణ ప్రజలు పడ్డ కష్టాలు మళ్లీ రావాలని ప్రజలు కోరుకోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ అంటేనే కుంభకోణాలు కుమ్ములాటలని ఆయన విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిది సంవత్సరాలలో సంక్షేమం అభివృద్ధి రంగాల్లో దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో ఉంచారని, తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశంలో బిజెపి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా లేవని ముఖ్యమంత్రి కేసీఆర్ నిన్న ప్రకటించిన మేనిఫెస్టో అంశాలను కాంగ్రెస్, బిజెపిలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. సురేందర్ రెండవసారి, ముఖ్యమంత్రి మూడోసారి విజయం సాధించడం ఖాయమని ఆయన అన్నారు. ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి సురేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే సాధ్యమైందని, వరి ఉత్పత్తిలో దేశంలోనే నెంబర్‌వన్ స్థానానికి ఎదిగామని, ఇన్ని సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్ రాష్ట్రానికి చేసిందేమీ లేదని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పగటి కలలు కంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తనాజీరావు, ఎంపీపీ రాధ బలరాం, జడ్పీటీసీ శంకర్ నాయక్, ఏఎంసి చైర్మెన్ సత్యంరావు, పిఏసిఎస్ చైర్మెన్ సాయికుమార్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, ఏఎంసి వైస్ చైర్మెన్ రెడ్డి రాజు, ఎంపిటిసి పత్తి శ్రీనివాస్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : త్వరలో జరగనున్న ఎన్నికల్లో మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని చేపడతారని ప్రజలు బిఆర్ఎస్‌కే పట్టం కడతారని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్, ఎమ్మెల్సీ విజి గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో పాలభిషేకం చేశారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు సీఎం కేసీఆర్ ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్‌కు బిఫామ్ అందజేయడంతో పాటు పార్టీ మేనిఫెస్టో ప్రకటించడంతో బిఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ విడుదల చేసిన మేనిఫెస్టో సబ్బండ వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉందన్నారు. రాష్ట్రంలో తిరిగి బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఎల్లారెడ్డిలో గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. దేశంలో ఎక్కడా లేని, ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయన్నారు. ప్రజలు భారతీయ జనతా పార్టీని, కాంగ్రెస్‌ను నమ్మరని ఆయన పేర్కొన్నారు. కులమతం పేరుతో గ్రామాల్లో చిచ్చుపెట్టడానికి బిజెపి పార్టీ ప్రయత్నింస్తుందన్నారు. 30 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిందేం లేదన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గరీబుని నయీమ్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నరహరి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బండి రాజయ్య, సర్పంచులు అనిల్‌రెడ్డి, రవీందర్, నర్సింలు, పద్మా నాగరాజు, ప్రకాష్, సత్యనారాయణ, రామ్‌రెడ్డి, జిలియా నాయక్, బన్నీ సక్రు, పుట్టి పోచయ్య, అట్టెం శీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫతియోద్దీన్, దేవేందర్, యూత్ మండల అధ్యక్షుడు నరేష్, ఎంపీటీసీలు గ్రామ కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ధరణిని తొలగిస్తాం

- జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-ఆర్మూర్

ఓటర్లు ఆలోచించి అవినీతికి పాల్పడిన పార్టీలకు కాకుండా అవినీతి లేకుండా పాలించే కమలం పార్టీకి ఓటు వేయాలని బిజెపి అధికారంలో రాగానే ధరణి ముందుగా తొలగిస్తామని జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ అన్నారు. పట్టణంలోని క్షత్రియ కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. పసుపు బోర్డు తీసుకుని వచ్చామని, పసుపు ధర 20వేల నుంచి 25 వేల వరకు పెరిగిన ఆశ్చర్యం లేదని అన్నారు. ప్రపంచంలో పసుపునకు చాలా డిమాండ్ ఉందని తెలిపారు. యూపీలో కర్ణాటకలో మూతబడిన చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆర్టీసీకి 9 కోట్లు, స్టేట్ కార్పొరేషన్‌కు 20 కోట్లు బకాయిలు ఉన్నారన్నారు. బిజెపి అధికారం రాగానే వడ్డీతో సహా వసూలు చేస్తామన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో టీఆర్ఎస్ బిజెపికి పోటీ ఉందని కాంగ్రెస్ మూడో స్థానంలో ఉందన్నారు. కచ్చితంగా బిజెపి ఏడు నియోజకవర్గాల్లో విజయం సాధించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ టికెట్ ఎవరికీ ఇచ్చిన అందరు కలిసి పార్టీని గెలిపించుకోవాలని ఆయన కోరారు. మళ్లీ టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే భూ కబ్జాలు, అవినీతి, రౌడీయిజాన్ని పోషించిన ట్లేనని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీ నరసయ్య, పెద్దొల్ల గంగారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, విజయభారతి, పాలెపు రాజు, జెస్సు అనిల్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కలిగోట్ క్రీడాకారుడు




నవ తెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన తలారి నీరజ్ అండర్ 19 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కలిగోట్ సర్పంచ్ చేతన విజయ రెడ్డి తెలిపారు. ఈనెల 17 నుండి 19 వరకు సదాశివపేట గ్రామంలో సంగారెడ్డి జిల్లాలో జరిగే కబడ్డీ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా నీరజ్‌ను ఉప సర్పంచ్ నాయిక రాజు ఎంపీటీసీ జయ గిరిధర్ గౌడ్ ఎస్ఎంసి చైర్మన్ సత్యనారాయణ గారు గ్రామ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు అభినందించారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి
- సుర్బిర్యాల్‌లో ప్రజా ఆశీర్వాద యాత్ర



ప్రజా ఆశీర్వాద యాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఈ పదేళ్ళలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని, నియోజకవర్గ ప్రగతి తన పనితీరుకు గీటురాయి అని బాగుపడని ఊరు లేదని, సంక్షేమం అందని ఇల్లు లేదని, ఈ అభివృద్ధి ముందుకు పోవాలంటే మళ్లీ గెలిపించాలని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు.

నమస్తే నవనాథ పురం కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలో "ప్రజాశీర్వాద యాత్ర" నిర్వహించారు. పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పలుసమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. గడపగడపకూ తిరిగి మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ.. సుర్బిర్యాల్‌కు వచ్చే సమయంలో గ్రామానికి కొందరు వికలాంగులు ఆపి ఎక్కడికి పోతున్నారు సార్ అని అడిగారన్నారు. అభివృద్ధి కార్యక్రమాల గురించి చెప్పి మూడోసారి కూడా ఓటేయమని అర్థించడానికి వెళుతున్నానని చెప్పాను. ఎందుకు సారు మీకనవసర శ్రమ, కేసీఆర్ మొన్ననే మా పెన్షన్లను రూ. 4016కు పెంచి మళ్లీ ఇప్పుడు రూ.6016 కు పెంచుతామని మాట ఇచ్చారని చెప్పారన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో 6వేలమంది వికలాంగులం ఉన్నామని, తామే ఇంటింటికీ తిరిగి ఒక్కొక్కలం 15 ఓట్ల చొప్పున వేయించి 70వేల ఓట్ల మెజారిటీతో గెలిపించుకుంటామని చెప్పారని తెలిపారు. బీమా పరిహారం తీసుకున్న గ్రామానికి చెందిన వారు సైతం ఓట్లు వేస్తామని చెప్పారని అన్నారు.

"బీఆర్ఎస్ మేనిఫెస్టో బంగారు భవిష్యత్తు కు బాటని, పేద ప్రజలకు ఒక వరమని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మితే ఆగమవుతాం. మళ్లీ బీఆర్ఎస్ గెలవడం చారిత్రిక అవసరం అని అన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం కావడం తెలంగాణ ద్రోహులకు చెంప పెట్టు" అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి మహారాష్ట్ర మంత్రికి ఆహ్వానం


మంత్రిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి శివసేన పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రచారానికి రావాలని కోరుతూ శివసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పసులేటి గోపికిషన్ సోమవారం నాందేడ్‌లో మహారాష్ట్ర మంత్రి గులాబ్‌రావు పాటిల్‌కు, నాందేడ్ ఎమ్మెల్యే బాలాజీ కళ్యాణ్కర్‌కు మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆహ్వానించారు. మంత్రి, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తెలంగాణలో శివసేన పార్టీ గెలుపు కోసం ప్రచారానికి వస్తామని పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట బోధన్ పట్టణ అధ్యక్షులు ఏనుగంటి గౌతమ్‌గౌడ్, మండల ఉపాధ్యక్షులు విస్లావత్ శ్రీను, నిజామాబాద్ జిల్లా బీవీఎస్ కో కన్వీనర్ చింతకుల లోకేష్‌గౌడ్, బోధన్ పట్టణ అధ్యక్షులు కాస్ప లింగం ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు


బీఆర్ఎస్ కార్యకర్తల సబురాలు

నవతెలంగాణ-రెంజల్

బోధన్ నియోజకవర్గం నుంచి మహమ్మద్ షకీల్ అమీర్‌కు బీఆర్ఎస్ పార్టీ నుంచి టికెట్ రావడంతో మండలంలోని బిఆర్ఎస్ నాయకులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో టపాసులు పేల్చారు. షకీల్ ఆమీర్‌ను గెలిపించడానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు వికార్ పాషా, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు ఎమ్మెస్ రమేష్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు హాజీ ఖాన్, సాటాపూర్ బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు భూమేష్, కృష్ణారావు, అజ్మత్, షబ్బీర్, శ్రీకాంత్, కె.సాయిలు, జాడిసాయిలు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలి


- ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అడ్డా
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గం ప్రధాన పాత్ర పోషించిందని, ఎల్లారెడ్డి గడ్డ బీఆర్ఎస్ అడ్డా అని ఎల్లారెడ్డి గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం మండల సమీపంలో జీఎస్ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గస్థాయి బూతు లెవల్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గులాబీ జెండా మోసింది తానే అన్నారు. ప్రతీ కార్యకర్త బూత్ లెవెల్ కార్యక్రమం నుండి మొదలుకొని ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని యుద్ధానికి సిద్ధంగా ఉండాలన్నారు. 50రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులకు వివరించాలన్నారు. బూత్‌స్థాయి కార్యకర్తలు ప్రధానపాత్ర పోషించాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు కల్మషం లేకుండా పనిచేస్తే గెలుపును ఎవరూ ఆపలేరని తెలిపారు. గత పాలకులు ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఏం మేలు చేసిందోనని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు మళ్ళీ మొదలవుతాయని ఆయన కార్యకర్తలను సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో నెంబర్‌వన్ అని.. దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మేనిఫెస్టో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా, గృహలక్ష్మి, బీసీబంధు, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి, సన్నబియ్యం, 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చామని తెలిపారు. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కనీసం ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. దేశ ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో కరెంటు కష్టాలు ఉన్నాయన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి తప్ప ఇంతమంది కార్యకర్తలు నాయకులు బూతు లెవల్ కార్యకర్తలు గ్రామ కమిటీ అధ్యక్షులు ఇతర పార్టీలో లేరని ఆయన అన్నారు. ఇతర పార్టీల్లో నాయకులు లేరని కార్యకర్తలు కరువయ్యారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించాలని ఆయన సూచించారు. ఎల్లారెడ్డిలో గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని, మీ రుణం తీర్చుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ విజి.గౌడ్, ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నాగిరెడ్డిపేట్ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, గాంధారి జెడ్పీటీసీ శంకర్ నాయక్, రాజంపేట జెడ్పీటీసీ హనుమాన్లు, ఎల్లారెడ్డి జెడ్పీటీసీ ఉష గౌడ్, ఆయా మండలాల ఎంపీపీలు, సర్పంచులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొలువు దీరిన దుర్గమాతలు



నవతెలంగాణ-రెంజల్

మండలంలో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండలంలో సుమారు 12 గ్రామాలలో విగ్రహ ఏర్పాటు చేశారు. మండపాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్ పేర్కొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీ లెక్కింపు

- రూ.1,36,707 ఆదాయం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ శివారులో గల పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో పాటు పాలకమండలి ఇతర శాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం అమావాస్య రోజున ఆలయంలో ప్రత్యేక వివిధ పూజ కార్యక్రమాలతో భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలు మొత్తం కలిపి లక్షా 36 వేల రెండు వందల ఏడు రూపాయల ఆదాయం వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో వేణు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మాదాయ శాఖ అధికారులు కమలమ్మ, జూనియర్ అసిస్టెంట్ రఘు, చిలుక నరసయ్య, పాలకమండలి సభ్యులతో పాటు పోలీస్ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది, తదితరుల ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు.

తహసీల్దార్ ఎదుట 16 మంది బైండోవర్

నవతెలంగాణ-రెంజల్

మండలంలో 16 మందిని తహసీల్దార్ రామచందర్ ఎదుట బైండోవర్ చేసినట్లు రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గతంలో అల్లర్లను సృష్టించిన వారిని గుర్తించి, వారందరిని సోమవారం బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు శాంతియుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని ఆయన సూచించారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పేద ప్రజల ఆకాంక్షను నెరవేర్చడం కోసం మంచి మేనిఫెస్టోను విడుదల చేశారని హర్షం వ్యక్తం చేశారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింలు, సర్పంచ్ సంజీవులు, నాయకులు రమేష్‌రావు, మేకల రాజు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో స్వచ్ఛభారత్

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రభుత్వ కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. కళాశాల ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి కుప్పగా పోశారు. అనంతరం కళాశాల నుంచి రోడ్డు వరకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తీసివేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సయ్యద్ యూసుఫ్ మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్‌లో కళాశాల ఆవరణమంతా శుభ్రపరచమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్, అధ్యాపకులు వీరేశం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 1982-1987 చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉమ్మడి జిల్లా మాచారెడ్డి మండలంలోని పాల్వంచ మర్రి వద్ద ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువుల పాదాలపై పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. అనంతరం పూలమాలవేసి శాలువాతో సన్మానించి మెమొంటోను అందించి రాగి పాత్రలను కానుకగా ఇచ్చి పాదాభివందనం చేసి గురువుల ఆశీర్వాదం పొందారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దేవాంగ విద్యా కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా దేవాంగ విద్య కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21న పదవ తరగతి 20వ జిల్లా స్థాయి ప్రతిభ పురస్కార అవార్డులు అందజేస్తున్నట్లు దేవాంగ విద్యా కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తిరుమల గార్డెన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సభ్యులందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ కల్లు, బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి


ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సిపిఐఎంఎల్ నాయకులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

అక్రమ కల్లు దుకాణాలు, బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు, బోధన్ ఆర్డీవో రాజగౌడ్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధన్ శివారులోని ప్రధాన రహదారిపై అక్రమంగా కల్లు విక్రయిస్తున్నారని, 10వ వార్డులో మద్యం షాపును తొలగించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పుట్ట వరదయ్య, సురేష్, వినోద్, భూమన్న, దేవదాసు, షేక్ నజీర్ తదితరులున్నారు.

నాగంపల్లి ముదిరాజు నూతన కార్యవర్గం ఎన్నిక


ముదిరాజ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని నాగంపల్లి గ్రామ ముదిరాజ్ నూతన కార్యవర్గమును మండల ముదిరాజ్ అధ్యక్షులు బుడాల నవీన్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మండల అధ్యక్షులు బుడాల నవీన్ మాట్లాడుతూ గ్రామ అధ్యక్షులుగా బోయినీ లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా మామిళ్ళ విరాజ్, సెక్రటరీగా బోయిని బావయ్య, సహాయ కార్యదర్శిగా నీరుడి మహేష్, కోశాధికారిగా మేకల కృష్ణ, పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ గ్రామ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోచారంలో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పోచారం గ్రామంలో ఆయుష్మాన్ భారత్ కింద 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు బోధన్ డివిజన్ ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కాశ రవి తెలిపారు. ఆయన స్వచ్ఛందంగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. లేబర్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో థైరాయిడ్, షుగర్, హెచ్ఐవీ, యూరిన్ టెస్ట్, గులాబ్ స్టాండ్ మొదలగు పరీక్షలు నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ డివిజన్ నాయకులు బి.మల్లేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ వైద్య సిబ్బంది అనిల్‌కుమార్, హేమలత, వంశీ, శశికాంత్, అశోక్ వైద్య పరీక్షలు నిర్ణయించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కాశ రవి, అఖిలభారత ప్రగతిశీల మండల నాయకులు వైద్యనాథ్, జంగం రాజయ్య, పోశెట్టి కమ్మరి, రవి దండోరా అబ్బయ్య, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకు మూడుసార్లు గెలిపించారు

- నాలుగోసారి గెలిపించండి.. మీ సేవలో ఉంటా
- జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే


సమావేశంలో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే

నవతెలంగాణ-బిచ్కుంద

జుక్కల్ నియోజకవర్గ ప్రజలు నియోజకవర్గ అభివృద్ధికి నిస్వార్థ సేవ చేస్తున్న తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, జుక్కల్ నియోజకవర్గం ప్రజలకు సేవ చేయడానికి అవకాశం ఇచ్చి నాలుగోసారి తనను గెలిపించి ఆశీర్వదించాలని నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగిపోదామని జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే అన్నారు. సోమవారం బిచ్కుంద మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే హనుమంత్ షిండే మాట్లాడుతూ తెలంగాణలో మహిళలకు ప్రథమ స్థానం కల్పిస్తూ మహిళల పేరుపైనే మహిళలకు సంక్షేమ పథకాలు అందిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మానవీయ పథకాల అమలులో భాగంగా అర్హులైన ప్రతి పేద మహిళలకు ప్రతి నెల 3వేల రూపాయలు జీవనభృతి అమలు చేస్తామని, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ దగ్గర నుండి విపరీతంగా పెంచేసి పేద ప్రజలపై భారం మోపిందని ప్రజల వినతుల మేరకు 400 రూపాయలకే వంటగ్యాస్ అందజేస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10 లక్షల నుండి 15 లక్షలకు పెంచనున్నట్టు వివరించారు. గతంలో జుక్కల్ నియోజకవర్గం వెనుకబడగా గత పది సంవత్సరాల్లో పంచాయతీరాజ్ శాఖలో ఉన్న 100 బీటీ రోడ్లలో 80 రోడ్లు పూర్తి చేసుకోవడం జరిగిందని ఆర్అండ్‌బీ శాఖ ద్వారా 450 కోట్లతో 14 రోడ్లు డబుల్‌లైన్‌గా మార్చామని తెలిపారు. బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, జుక్కల్, మద్నూర్ మండల కేంద్రాల్లో 44 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు మొదలై కొనసాగుతున్నాయని, పేదల మెరుగైన జీవనానికి ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన మేనిఫెస్టో విడుదల చేశారని, మేనిఫెస్టో చూసిన ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ కామారెడ్డి నుండి పోటీ చేస్తున్నారని జిల్లాలో ఏకైక ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కాబట్టి అభివృద్ధిలో ముందుంటుందని అన్నారు. తన మీద నమ్మకంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ అధ్యక్షులు బీఆర్ఎస్ పార్టీ బీ ఫామ్ ఇవ్వడం జరిగిందని జుక్కల్ నియోజకవర్గం ప్రజలు అఖండ మెజారిటీతో మూడుసార్లు గెలిపించారని, ఈసారి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, ఎంపీపీలు అశోక్‌పటేల్, ప్రతాప్‌రెడ్డి, నీలుపటేల్, దుర్గారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, యువ నాయకులు హరీష్ షిండే, ఆత్మ చైర్మన్ కొండ గంగాధర్, రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలాజీ, నాయకులు సాయిగౌడ్, మాధవరావు దేశాయ్, రామ్‌చందర్, బొమ్మల లక్ష్మణ్, జుక్కల్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలున్నారు.

ఓటమి భయంతోనే

అధికార పార్టీ అసత్య ప్రచారాలు

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నార్రెడ్డి మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

సర్వేలన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా రావడంతో, కామారెడ్డిలో కెసిఆర్ ఓటమి భయంతోనే, అధికార పార్టీ నాయకులు షబ్బీర్ అలీ కామారెడ్డిలో పోటీ నుంచి తప్పుకుంటుండని అసత్య ప్రచారాలను చేస్తున్నారని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ గతంలో అనేక సంక్షేమ పథకాలను, ప్రజా అభివృద్ధి పనులు చేసి ప్రజల గుండెల్లో ఉన్నారని, ప్రజలు కాంగ్రెస్ పక్షాన ఉన్నారని తెలుసుకొని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికి, అధికార పార్టీ నాయకులు అసత్య ప్రచారాలను చేస్తున్నారని, ఇలాంటి వదంతులను ప్రజలు, కాంగ్రెస్ నాయకులు నమ్మవద్దని అన్నారు. కామారెడ్డి గడ్డ, కాంగ్రెస్ అడ్డా అని, కామారెడ్డి గడ్డపై పుట్టిన షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఓడించడం ఖాయమని, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు అధికార పార్టీ దుష్ప్రచారాలను, వదంతులను తిప్పికొట్టాలని, పార్టీ గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యేపై.. పచ్చబొట్టంత అభిమానం



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అభిమాని తన కుడి చేతిపై ఎమ్మెల్యే జాజల సురేందర్ బొమ్మను పచ్చ బొట్టు వేసుకొని తన అభిమానాన్ని చాటుకున్నాడు. లింగంపేట్ మండలం భవానీపేట్ మండలం భవానీపేట్ గ్రామానికి చెందిన భాను ఎమ్మెల్యేపై అభిమానంతో పచ్చ బొట్టు వేయించుకున్నానని వచ్చే ఎన్నికల్లో జాజాల సురేందర్ గెలుపుకోసం కృషి చేస్తానని తెలిపారు.

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వ పరం చేయాలి

- 73వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వ పరం చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారం 73వ రోజుకు చేరుకున్నాయి. కార్మికులకు మద్దతుగా బిజెపి నియోజకవర్గ నాయకులు హన్మకొండ జిల్లా ఇంచార్జ్ అడ్లూరి శ్రీనివాస్ ఈ సందర్భంగా అడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బోధన్ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెలంగాణ ప్రభుత్వం వెంటనే తెరిపించి ప్రభుత్వ పరం చేసి, 2015 సంవత్సరం నుంచి కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అనారోగ్య కారణాలతో చనిపోయిన కార్మిక కుటుంబాలను ఆదుకుని, కబ్జాలకు గురవుతున్న నిజాంషుగర్స్ భూములను రక్షించాలని డిమాండ్ చేశారు. 73వ రోజు దీక్షలో నగేష్, రఘు, అన్వార్‌మియా, మొయిన్‌ఉద్దీన్, గలయ్య నయీమోద్దీన్, బషీర్ పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

గర్భిణులకు అవగాహన


అవగాహన సదస్సులో పాల్గొన్న గర్భిణీలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని మత్తమాల పిహెచ్‌సిలో వైద్యులు శరత్‌కుమార్ గర్భిణులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 64 మంది గర్భిణులకు పలు సూచనలు చేశారు. గర్భిణులు నార్మల్ డెలివరీ అయ్యే విధంగా సిద్ధంగా ఉండాలని ప్రభుత్వాసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు న్యూట్రీషియన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైద్య తదితరులు పాల్గొన్నారు.


కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కార్యకర్తలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ప్రజలకు ఎంతో మేలు చేసే విధంగా ఉన్నాయని ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలకు, మహిళలకు ఎంతో ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నాయని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ బీఆర్ఎస్‌కే పట్టం కడతారని తెలిపారు. కేసీఆర్, ఎమ్మెల్యే జాజాల సురేందర్ నాయకత్వాన్ని ప్రజలందరూ బలపరుస్తారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఆదిమూలం సతీష్, బీఆర్ఎస్ నాయకులు అల్లం శీను, శ్రావణ్‌కుమార్, ఎడ్ల కిషన్, ఎరుకల సాయిలు, దామోదర్, అరవింద్‌గౌడ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌గా మహమ్మద్ షరీఫ్



నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ తహశీల్దార్ కార్యాలయం డిప్యూటి తహశీల్దార్‌గా మహమ్మద్ షరీఫ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సదాశివనగర్‌లో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన సాయిలు ఉన్నత ఉద్యోగంపై బదిలీ అయినట్లు తెలిపారు. ఆయన కామారెడ్డి జిల్లా నుంచి పాల్వంచ మండలానికి తహశీల్దార్‌గా వెళ్లినట్లు తెలిపారు.

జుక్కల్ టికెట్ కోసం వైఎస్సార్ షర్మిల పార్టీకి దరఖాస్తు

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గానికి వైయస్సార్ షర్మిల పార్టీ టికెట్ కోసం మండలంలోని తడిహిప్పర్గ సర్పంచ్ గైక్వాడ్ ప్రకాష్ సోమవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో పిట్ట రామ్‌రెడ్డికి దరఖాస్తు అందజేశారు. వైయస్సార్ కాంగ్రెస్ షర్మిల పార్టీ తరపున జుక్కల్ అసెంబ్లీకి పోటీ చేసేందుకు సర్పంచ్ ముందుకు వచ్చారు.

ప్రతి ఆటోకు డాక్యుమెంట్లు సరిగ్గా ఉండాలి

నవతెలంగాణ-తాడ్వాయి

ప్రతి ఆటోకు డాక్యుమెంట్లు సరిగ్గా ఉండాలని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఆయన ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా 31 మంది ఆటో నిర్వాహకుల ఆటోల డాక్యుమెంట్లు పరిశీలించారు. ప్రతి ఆటోకు సరైన కాగితాలు ఇన్సూరెన్స్ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు శంకర్‌గౌడ్, రాజయ్య, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు క్లీనింగ్



రోడ్డును శుభ్రం చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో సోమవారం రోడ్డు శుద్ధి కార్యక్రమాలను చేపట్టారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో గ్రామంలో దసరా నవరాత్రుల సందర్భంగా సావా (రథం) తిరిగే దారిలో గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ ద్వారా నీళ్ళు పోసి రోడ్డుపై దుమ్ము ధూళి లేకుండా శుభ్రం చేయించారు. రోడ్డు శుద్ధి కార్యక్రమాలను గ్రామ సర్పంచ్ సక్కరం అశోక్ స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని పడిగల్ ఎక్స్ రోడ్డు వద్ద వెహికిల్స్ చెకింగ్ చేస్తుండగా జగిత్యాలకు చెందిన నీలగిరి అనీల్ రావు అనే వ్యక్తి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఆయనవద్ద లక్ష రూపాయలు ఉండగా వాటికి ఎలాంటి ధ్రువ పత్రాలు చూపించలేదు. దీంతో లక్ష రూపాయల ను పంచనామా చేసి సీజ్ చేశారని ఎస్సై వినయ్ కుమార్ సోమవారం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రయాణాల్లో ఎవరు కూడా 50 వేల కంటే ఎక్కువగా డబ్బులు ఉంచుకోరాదని తెలిపారు.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రెండో అంతస్తునుంచి దూకి వృద్ధురాలి ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పై నుంచి వృద్ధురాలు దూకి ఆత్మహత్యకు పాల్పడడం కలకలం రేపింది. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున జామున జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం జంగాయిపల్లి గ్రామానికి చెందిన బేగరీ రత్నమ్మ (65) ఆమె కూతురు పద్మలు జిల్లా జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. పద్మ అనారోగ్య పరిస్థితికి తోడు ఆమెకు కల్లు సేవించే అలవాటు ఉంది. సెక్యూరిటీ సిబ్బంది కళ్ళు కప్పి తీసుకువచ్చేందుకు ప్రయత్నించగా ప్యాకెట్లను లోనికి అనుమతించలేదని తెలిసింది. ఆదివారం రాత్రి తన కూతురుకు వైద్య సేవలు అందకపోవడం, కనీసం కల్లు ఇస్తామన్న సిబ్బంది అంగీకరించకపోవడంతో వృద్ధురాలు బేగరి రత్నమ్మ మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న చేసుకుంది. ఈ మేరకు ఒకటవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఇందూరు యువత

నవతెలంగాణ-కంఠేశ్వర్

వారం రోజుల క్రితం ఆనారోగ్యంతో మృతిచెందిన ఓ అనాథ శవానికి ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సోమవారం అంత్యక్రియలను నిర్వహించారు. 3వ ఠాణా ఎస్ఐ ప్రవీణ్ అనుమతితో నేడు దుబ్బ రోడ్డులోని సార్వజనిక్ శ్మశాన వాటికనందు సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, గౌరవ అధ్యక్షులు మద్ది గంగాధర్, ఈ.సి మెంబర్ కాసుల సాయితేజ, కార్యవర్గ సభ్యులు మయూర్, జయదేవ్ సదరం హెూం ఇంఛార్జ్ శ్రీదేవి, సమత, తదితరులు పాల్గొన్నారు.

పిరమిడ్ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న శ్రీనివాస్, మేఘనా దంపతులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సుప్రసిద్ధ దేవస్థానం సిద్దుల గుట్ట నందు నిర్మిస్తున్న తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద రెండవ పిరమిడ్ నిర్మాణం కోసం పట్టణానికి చెందిన డీ కొండ శ్రీనివాస్ మేఘనా దంపతులు 51,116రూపాయల విరాళాన్ని సోమవారం అందజేశారు. పిరమిడ్ ధ్యాన మందిరం భవిష్యత్తులో గొప్ప క్షేత్రం కావాలని ప్రజలందరూ అందులో ధ్యానం చేసి ఆత్మజ్ఞానం పొందాలని ఇంత చక్కని పిరమిడ్ నిర్మాణానికి మా వంతు సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో పి ఎస్ ఎస్ ఎం జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణ రెడ్డి, ముఖ్య సలహాదారులు బొడ్డు దయానంద్ , భాషిత స్కూల్ అధినేత సుందర్ పిరమిడ్ మాస్టర్లు చిదురరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోచేరికలు

నవతెలంగాణ-నవీపేట్

బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము శరత్ రెడ్డి ఆధ్వర్యంలో నవీపేట్ టిఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి సమక్షంలో హైదరాబాదులో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. నవీపేట్ మండలం నుండి రెండువందల మంది చేరినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. లింగాపూర్ మాజీ బాలరాజ్ గౌడ్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు చేరారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి..

- ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ మోహన్



మాట్లాడుతున్న ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని జిల్లా యువ నాయకులు,ఒలంపిక్ జిల్లా ఉపాధ్యక్షులు, దర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మోహన్, ఎంపీపీ భదవత్ రమేష్ నాయక్, డీసీయంయస్ చైర్మన్ సాంబారి మోహన్, పార్టీ మండల అధ్యక్షులు చిలువేరి దాస్ ఇతర నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి జగన్ మోహన్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త సైనికుల బీఆర్ఎస్ పార్టీ కోసం పని చేయాలన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లవేళలా గుర్తిస్తుందన్నారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో గ్రామాల్లోకి ప్రతిపక్ష పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వచ్చి కల్లబొల్లి మాటలు చెబుతారని వారి మాటలు నమ్మొద్దన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను మూడోసారి లక్ష మెజార్టీతో గెలిపించేలా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బిరిష్ శెట్టి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్ రెడ్డి, రూరల్ ఎస్సీ సెల్ కన్వీనర్ పాశంకుమార్, ఎంపీటీసీలు చింతల దాసు, సుధాకర్, సిహెచ్ దాస్, ప్రవీణ్ గౌడ్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్, పాశం నర్సింలు, సర్పంచ్ నరేష్, తెలు విజయ్ కుమార్, అంబర్ సింగ్, రాజు నాయక్, కచ్చకాయల శ్రీనివాస్, సర్పంచ్లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఈ సారైనా "బెల్ట్" తొలగించేనా?

- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు
- వీడీసీల కనుసన్నల్లోనే నిర్వహణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వచ్చేనెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను అధికారులు ఈసారైనా తొలగిస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో బెల్ట్ షాపులు గ్రామ అభివృద్ధి కమిటీల కనుసైగల్లోనే కొనసాగుతున్నాయి. ఒక్కొక్క గ్రామంలో బెల్ట్ షాపులు దక్కించుకోవడానికి గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించి లక్షలరూపాయలుపెట్టి బెల్ట్ షాపులను దక్కించుకున్నారు. ఈ బెల్ట్ షాపుల్లో వేకువ జాము నుండి అర్ధరాత్రి వరకు ఎలాంటి అడ్డు అదుపు లేకుండా సమయ పాలన లేకుండా ఇష్టానుసారంగా విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. ఉదాహరణకు ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి, నల్లవెల్లి గ్రామాల్లో 8 లక్షల నుండి 10 లక్షల రూపాయలకు బెల్టు షాపును వేలంలో దక్కించుకున్నారు. ఇదే కాకుండా గిరిజన తాండల్లో సైతం నేడు బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామం పెద్దదైనా చిన్నదైనా బెల్ట్ షాప్‌కి వేలం ఉంటుంది. ఇది గ్రామాభివృద్ధి కమిటీ కాకుండా ఆ గ్రామానికి సమీపంలో ఉన్న వైన్స్ దుకాణం ద్వారానే అవసరమున్నప్పుడల్లా ఆ వైన్స్‌లోనే చెప్పిన ధరకు కొనుగోలు చేస్తూ తీసుకొని వెళుతుంటారు. ఇదంతా సంబంధిత శాఖకు తెలిసిన అంశమే. కానీ ఏ ఒక్కరోజు ఏ ఒక్క గ్రామంలోని బెల్ట్ షాపులో దాడులు చేసిన దాఖలాలు మాత్రం ఒక్కటి కూడా కనబడటం లేదని పలువురు పేర్కొంటున్నారు. గ్రామాల్లో వేలాపాలలేని బెల్ట్‌షాపుల్లో ఉదయం లేచినప్పటి నుండి సాయంత్రం వరకు తాగుతూ వచ్చి పోయే వారికి సైతం ఇబ్బందులకు గురి చేస్తున్న ఏమి చేయలేక పోతున్నామని పలువురు మహిళలు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఎందుకంటే బెల్టు షాపు



బెల్ట్ షాపులను తనిఖీ చేస్తున్న అధికారులు

గ్రామాభివృద్ధి కమిటీ కనుసైగల్లోనే ఉండడంతో ఏమీ చేయలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ప్రతినెల వైన్ షాపులకు వచ్చి తనిఖీల పేరా మామూలుగా తీసుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. దాన్ని నియంత్రించవలసిన ఆ శాఖ అధికారులే పట్టించుకోకపోవడంతో బెల్ట్ షాప్‌లగురించి ఎవరికి చెప్పాలో తెలియక ఇబ్బందులైన ఓర్చు కుంటున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందు గ్రామాలకే పరిమితమైన బెల్ట్ షాపులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన తర్వాత అక్కడ కూడా మొదలయ్యాయి. కూలిచేసిన డబ్బులు మద్యానికి వెచ్చిస్తున్నారని మహిళలు పేర్కొంటున్నారు.

బాటిల్‌పై రూ.50 అదనం వసూలు

గ్రామాభివృద్ధి కమిటీకి లక్షల రూపాయలు వెచ్చించి ఏడాదికి సొంతం చేస్తున్న బెల్ట్ షాపుల్లో మద్యం ధరలకు అంతులేకుండా పోయిందని అంటున్నారు. ఒక్క బీరు బాటిల్, చీఫ్ లిక్కర్, తదితర బాటిల్‌పై 30 నుంచి 50 రూపాయలు అదనంగా ముక్కు పిండి వసూలు చేస్తున్నారని, ఇదే కాకుండా తినడానికి వస్తువులు కూడా ఎక్కువ ధరలో విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రశ్నించే నాయకుడు లేక ఎవరికి చెప్పాలో తెలియక అత్యవసరంగా మద్యం అవసరమైన వారు ఎంత డబ్బులైన పెట్టి కొనుగోలు చేసుకుంటున్నారు. అవసరం ఉన్నప్పుడల్లా అధికారులు ఇలా వచ్చి అలా వెళ్తున్నారు తప్ప బెల్ట్ షాపులపై శ్రద్ధ తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వాటికి రెండంతలు వసూలు చేసుకోవడానికి బెల్టు షాపులు కావాల్సిన వారు వేలం పాటల్లో పాల్గొంటూ ఏడాదికి 9,10 లక్షలు పెట్టడానికి సిద్ధపడే బెల్ట్ షాపులను దక్కించుకుంటు న్నారు. వైన్స్‌లకు కేటాయించుకున్న గ్రామంలోని బెల్ట్ షాప్ నిర్వాహకుడు ఆ వైన్స్ నుండే మద్యంను కొనుగోలు చేయవలసి ఉంటుంది. ఒకవేళ వేరే వైన్స్ నుంచి మద్యం కొనుగోలు చేసిన వైన్స్ యజమానులే అధికారులకు గుట్టు చప్పుడు కాకుండా ఫిర్యాదు చేసి ఆ వ్యక్తిపై దాడులను చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేసి కేసులను నమోదు చేయిస్తూ న్నారని పలువురు బాధితులు వాపోయారు.

అమ్మితే వైన్స్ నుండి అమ్మాలి లేకపోతే గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లోనే అమ్ముకోవాలని షరతులు పెట్టుకున్నారు. ఇతరులు ఎవరైనా అమ్మినా వారు కటకటాల పాలు కావాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని



లభ్యమైన మందు బాటిల్లు

గ్రామాల్లో ఇతర మండలాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు వేలంలో పాల్గొంటూ షాపులను దక్కించుకొని ఇతరులకు అందజేస్తున్నారు. తమకు వెనుక ముందు రాజకీయ నాయకుల బలం ఉందనే ఏకైక కారణంతో దోచుకుంటున్నారు. ఇదంతా ఒక ఎత్తైతే అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. గతంలో ఒక గ్రామంలో చేపట్టాలన్న ఇబ్బందులు ఎదుర్కనే వారమని ఇప్పుడు అలా కాకుండా బెల్ట్ షాపులు పెట్టుకున్న పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలు ఉన్నాయి. ఇకనైనా అధికారులు పాలకులు స్పందించి బెల్ట్ షాపులను మూయించివేస్తే గ్రామాల్లో ఎలాంటి గొడవలకు ఆస్కారం ఉండదని పలువురు మహిళలు, ప్రజలు అంటున్నారు. ఆ దిశగా అధికారులు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

బెల్ట్ షాపులపై దాడులు..

మద్యం సిజ్, కేసు నమోదు..ఎస్ ఐ మహేష్ ..

ఎన్నికల నిబంధనలు అతిక్రమించి ఇందల్‌వాయి మండలంలోని గౌరారం, ఇందల్‌వాయి తండా, వెంగల్‌పాడ్ గ్రామాల్లో బెల్ట్ షాపుల యజమానులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద ఉన్న మద్యంను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆదివారం నవతెలంగాణలో ఏని టైం మద్యం లభ్యం అనే శీర్షికతో వార్త కథనం రావడంతో బెల్ట్ షాపులపై ఇందల్ వాయి పోలిస్ స్టేషన్ ఎస్ఐ మహేష్ అధ్వర్యంలో దాడులను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గుట్టు చప్పుడు కాకుండా బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నరనే సమాచారం మేరకు సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు చేసి మద్యం ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గత కొన్నిరోజుల క్రితం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారికి పోలిస్ స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించామని వివరించారు. ఇకపై బెల్టు షాపులు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మేనిఫెస్టోలోని హామీలు అమలు చేస్తాం

నవతెలంగాణ-బాల్కొండ

మేనిఫెస్టోలోని హామీలు అమలు చేస్తామని మండల బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు యామగంటి లింగాగౌడ్, దాసరి వెంకటేష్, రైతు బంధు మండల కో-ఆర్డినేటర్ నాగులపల్లి రాజేశ్వర్ మాట్లాడారు. బాల్కొండ ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హయాంలో చరిత్రలోనే నిలిచిపోయే విధంగా బాల్కొండ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని వారు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారధ్యంలో దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని, తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలబెట్టారని అన్నారు. బాల్కొండలో చేసిన అభివృద్ధి పనులను గడప గడపకు వెళ్లి ప్రజల్లోకి తీసుకవేళ్ళాలని వారు కోరారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులను గుర్తించి మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించే విధంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. మేనిఫెస్టోలో ఆసరా పెన్షన్లు, రైతుబంధు, మహిళల కోసం ప్రత్యేక స్కీమ్‌లు ప్రకటించారని తెలిపారు. అర్హులైన మహిళలకు నెలనెలా జీవన భృతి, పేద మహిళలకు రూ.400కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం, తెల్లకార్డు కలిగి ఉన్న ప్రతి పేదఇంటికి రైతుబీమా తరహాలోనే ఎల్ఐసీ ద్వారా 5 లక్షల రూపాయల జీవితభీమా అందిస్తామని చెప్పారు. రైతుబంధు కింద ఇస్తున్న పంట పెట్టుబడి సాయం ఎకరానికి ఏటా 10వేల రూపాయలు బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే రైతుబంధు సాయాన్ని మొదటి సంవత్సరం ఎకరానికి ఏటా 12,000 రూపాయలకు పెంచుతుందని హామీ ఇచ్చారని తెలిపారు. వచ్చే ఐదేండ్లలో రైతుబంధు సహాయాన్ని క్రమంగా పెంచుతూ గరిష్టంగా ఎకరానికి ఏటా 15వేల రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు పాలసీని యధావిధిగా కొనసాగిస్తామని అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు తౌటు గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్, రైతు బంధు మండల కో ఆర్డినేటర్ నాగులపల్లి రాజేశ్వర్, సొసైటీ చైర్మన్ నాగులపల్లి సూరజ్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సాగర్ యాదవ్, సర్పంచులు మానేటి తులసి-నాగభూషణం, పెంటు లింబాద్రి, కర్రె కల్యాణి- గంగయ్య, ఎంపీటీసీ సభ్యులు మామిడి దివ్య-రాకేష్, కన్న లింగవ్వ-పోశెట్టి,అనుగుల రాం రాజ్ గౌడ్, ఉపసర్పంచులు షేక్ వాహబ్, గ్రామ శాఖ అధ్యక్షులు ఎంబరి శరత్, కోటగిరి శ్రీకాంత్ చారి, నోముల మోహన్ ,వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేంపల్లి చిన్న బాల్ రాజేశ్వర్, సొసైటీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ గౌడ్, వార్డు సభ్యులు గాండ్ల రాజేష్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎం ఏ షాహిద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మహమ్మద్ ఇఫ్తాకరోద్దీన్, మండల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జోనల్ స్థాయి క్రీడాపోటీల్లో..

- ధర్మారం క్రీడాకారుల ప్రభంజనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడాపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆరు ట్రోఫీలను డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) గురుకుల పాఠశాల కైవసం చేసుకుంది. బాసర జోన్ పరిధిలోని నిజామాబాద్, అదిలాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాలకు సంబంధించిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు 13 నుండి 16 వరకు నిర్మల్ జిల్లాలోని లెఫ్ట్ పోచంపాడులో నిర్వహించారు. ఇందులో 14 తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. అందులో అండర్-14 విభాగం లో గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్, 17 విభాగంలో గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్, అథ్లెటిక్స్ ఇండి విజువల్ ఛాంపియన్ షిప్, అథ్లెటిక్ ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్, 19 విభాగంలో గేమ్స్ ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్, అథ్లెటిక్స్ ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ ట్రో ఫిలను కైవసం చేసుకున్నారు. వ్యాయామ అధ్యాపకురాలు నీరజ, వ్యాయమ ఉపాధ్యాయురా లు జ్యోత్స్నను క్రీడాకారినులను సిఓఈ ధర్మారం బి పాఠశాల ప్రిన్సిపల్ సంగీత, నిజామాబాద్ ప్రాంతీయ సమన్వయ కర్త అలివేలు ప్రత్యేకంగా అభినందించారు. జోనల్ స్థాయి పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి లో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు.



విజయం సాధించిన గురుకుల పాఠశాల విద్యార్థులు

దిల్ రాజును పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన సినీ నిర్మాత దిల్ రాజు తండ్రి శ్యాంసుందర్ రెడ్డి స్వర్గస్తులైన సందర్భంగా ఆయన కుమారులైన దిల్ రాజు, నరసింహారెడ్డిని పరామర్శించారు. హైదరాబాద్‌లో ఆయన నివాసానికి వెళ్లి శ్యాంసుందర్ రెడ్డి ఫోటోకు నివాళులర్పించి దిల్ రాజు, నరసింహారెడ్డిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



దిల్ రాజును పరామర్శించిన ఎమ్మెల్యే

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుడు

నవతెలంగాణ-ఏర్గట్ల

బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో ప్రకటించిన సందర్భంగా పార్టీ మండలాధ్య క్షులు పూర్ణానందం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సోమవారం సంబరా లు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్ణానందం మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో పేదలు, రైతులు, మహిళలకు ఆమోదయోగ్యంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి,జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, సర్పంచులు భాను ప్రసాద్, కుండ నవీన్, నాయకులు బద్దం శ్రీనివాస్ రెడ్డి, నెరేళ్ళ లింగారెడ్డి, అంజిరెడ్డి, బద్దం ప్రభాకర్, రొక్కెడ మోహన్, మారు నరేష్, కొలిప్యాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సందర్శక పరిశోధనకు ఎంపికైన అసిస్టెంట్ ప్రొఫెసర్



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూరు గ్రామ శివారులోగల క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాడవేడి సుధాకర్ మలేషియాలోని ఐఎస్‌టిఐ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో సందర్శక పరిశోధక కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఆయన అక్టోబర్29 నుండి నవంబర్ 07వరకు మలేషియాలోని ఐఎస్‌టిఐ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో పర్యటిస్తారు. అక్కడ జరిగే వివిధ సంక్షిప్త పరిశోధన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ విశ్వవిద్యాలయం ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లో 500-600 బ్యాండ్‌లో నిలిచింది. ఈ సందర్భంగా ఆయన భారత్‌లో డిజిటల్ పేమెంట్లలో ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలకంటే ముందున్న తీరు, కరోన నియంత్రణలో భారత్ అవలభించిన పద్ధతులు, వ్యాక్సిన్‌ను ప్రపంచ దేశాలకు అందించిన విధానం, రెండు దశబ్దాల్లో రిటైల్ రంగంలో వస్తున్న మార్పులు, వాటిలో ఇమిడి ఉన్న మేనేజ్మెంట్ సబ్జెక్ట్ అంశాలను అక్కడి మేనేజ్మెంట్ పరిశోధన విద్యార్థులకు వివరించనున్నారు. వీటితోపాటు ఐఎస్‌టిఐ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం నిర్వహించే వివిధ కాన్ఫరెన్స్‌లు, వర్కుషాప్, గెస్ట్ లెక్చర్లలో పాల్గొననున్నారు. ఆయన్ను చైర్మన్ అల్జపూర్ శ్రీనివాస్, సెక్రెటరీ అల్జపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ డా.ఆర్కే పాండే, ఎంబీఏ డిపార్ట్మెంట్ స్టాఫ్ అభినందించారు.

నగదు పట్టివేత

నవతెలంగాణ-మోర్తాడ్

జాతీయ రహదారి 63 వద్ద వాహనాల తనిఖీలు చేపట్టి రెండు లక్షల 50వేల రూపాయలు నగదు పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ రెడ్డి సోమవారం తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్దంగా డబ్బులను తరలిస్తుండగా వాహన తనిఖీల్లో పట్టుకున్నామన్నారు. అనుమతి పత్రాలు లేకుండా నగదు తరలిస్తే సీజ్‌చేసి ఇన్కమ్ టాక్స్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని కృష్ణవేణి హై స్కూల్‌లో సోమవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపాధ్యాయ బృందం పూలతో బతుకమ్మను ఏర్పాటు చేశారు. పాఠశాల నుండి కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, వినాయక్‌నగర్, మార్కెట్ మీదుగా బతుకమ్మ పాటలు పాడుతూ, దాండియాలు చేస్తూ చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కోటగిరి భానుచందర్, ఆకుల లక్ష్మణ్, ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్, సూపర్ వైజర్ బి.రాజేందర్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



కృష్ణవేణి హై స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు

వేములను పరామర్శించిన మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



మంత్రిని పరామర్శించిన మంత్రి పట్నం మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని మంత్రి పట్నం మహేందర్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల మంత్రి ప్రశాంత్ రెడ్డి తల్లి మంజులమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం వేల్పూర్ లోని ప్రశాంత్ రెడ్డి నివాసంలో రాష్ట్ర గనులు, భూగర్భవనరుల సమాచార శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మంజులమ్మ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.